సాక్షి
కర్నూలు
శనివారం ၊ 22 ၊ ఏప్రిల్ ၊ 2023



బ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.



గాలి వాన బీభత్సం

పాములపాడు: కొత్తపల్లి, పాములపాడు ఆత్మ కూరు తదితర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, వర్షానికి కల్లాల్లో ఆరబోసిన పంట ఉత్పత్తులు తడిసిపోయాయి.



పొలాల్లో పులి సంచారం

రుద్రవరం: కోటకొండ గ్రావ పొలాల్లో పెద్ద పులి సంచరిస్తోంది. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

న్యూస్‌రీల్

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



ప్రతిజ్ఞ చేస్తున్న ఐఏఎస్ అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందిస్తే అంతకన్న ఆనందం మరొకటి ఉండదని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో 16వ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. తనతోటి సివిల్ సర్వీసెస్ అధికారులైన జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సకాలంలో పౌరులకు సేవలు అందించడమే ముందున్న లక్ష్యమని, ఇందుకోసం ప్రభుత్వ శాఖల్లోని ఇతర అధికారులందరూ తమకు సహకారం అందించాలన్నారు.

ఈ ఏడాది 5వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం

- ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 5వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. ఐదు ఎకరాల్లోపు సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం, 5 ఎకరాల పైబడి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం రాయితీతో బిందు సేద్యం కల్పిస్తామని పీడీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తుంపర్ల సేద్యానికి 5 ఎకరాల్లోపు రైతులకు 55 శాతం, 5 ఎకరాలు పైబడి 12 ఎకరాల్లోపు రైతులకు 45 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఆర్‌బీకే ఇన్‌చార్జిలను సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 08518-279724 లేదా 96420 00919 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఊరూరా స్వచ్ఛ ధార!

- మంచినీటి ట్యాంకుల శుభ్రతకు ప్రాధాన్యం
- దేవర్లు, జాతర్లలో నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు
- ప్రతి నెలా 2, 17వ తేదీల్లో తప్పనిసరిగా ట్యాంకుల క్లీనింగ్
- ఎక్కడా అంటురోగాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు
- రూ.8 కోట్ల సాధారణ నిధులు వెచ్చించుకునే సౌలభ్యం

ప్ర'జల'కష్టాలు తీరుస్తూ.. పల్లెల్లో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా మంచినీటి ట్యాంకుల శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వేడుకల్లో జలం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు గ్రామ పంచాయతీ సాధారణ నిధులు వినియోగించుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేశారు.



హొళగుందలో మంచినీటి ట్యాంకులో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది



కోసిగి మండలం డీ బెళగల్‌లో జీఎల్‌ఎస్‌ఆర్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కర్నూలు(అర్బన్): తాగునీరు కలుషితమైతే అనేక రకాల రోగాలు దరి చేరుతాయని వైద్యులు చెబుతున్నారు. వేసవి కాలంలో గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బావులు, కుంటల్లో నీరు కలుషితమవుతోంది. అలాగే మంచి నీటి పైపులు లీక్ కావడం వల్ల అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోంది. వెంటనే లీక్ అయిన పైపులను గుర్తించకపోవడం, ఆయా పైపుల నుంచి సరఫరా అయ్యే నీటినే తాగడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాంతులు, విరేచనాలతో అనారోగ్యాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా పోయిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి రక్షిత మంచి నీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. కర్నూలు జిల్లాలోని ఏ గ్రామంలో కూడా కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టారు. ప్రతి నెలా 2, 17వ తేదీల్లో తప్పనిసరిగా ఆయా గ్రామ పంచాయతీల్లోని ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎస్‌ఎల్‌ఆర్‌లను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేసింది.

యుద్ధప్రాతిపదికన చర్యలు

గ్రామ పంచాయతీ పరిధిలోని నీటి వనరులు, పైప్‌లైన్లను తనిఖీలు చేయడంతో పాటు లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాల్సి ఉంది. మంచినీటిని సరఫరా చేసే పైప్‌లైన్లలో ఎక్కడైనా మురుగు నీరు కలుస్తున్నాయా? లేదా? అని తనిఖీలు చేయాల్సి ఉంది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఉపరితల, భూగర్భ నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నీటి ట్యాంకులను నింపిన ప్రతిసారి తప్పకుండా నిర్దిష్ట ప్రమాణంలో క్లోరినేషన్ చేయాలని, కుంటల్లో నిల్వ ఉన్న నీటిని తాగరాదని గ్రామాల్లో దండోరా వేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామాల్లోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు, రక్షిత మంచినీటిని అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో నీటి ట్యాంకులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.

వేడుకల్లో ప్రత్యేక జాగ్రత్తలు

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా దేవర్లు, జాతర్లు, ఉరుసులు జరుగుతుంటాయి. వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతుంటారు. ఈ సమయంలోనే నీటి వినియోగం కూడా అధికంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య కూడా అధికంగా ఉంటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయి అధికారులు, సర్పంచులు వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

రూ.8 కోట్ల నిధులు

గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరముల కింద ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.17.16 కోట్లు వసూలయ్యాయి. ఇందులో నుంచి గ్రామ పంచాయతీ సాధారణ నిధుల కింద రూ.8 కోట్లను పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు, రక్షిత మంచి నీటిని అందించేందుకు వెచ్చించుకునే సౌలభ్యం ఉంది.

జిల్లాలో నీటి ట్యాంకుల వివరాలు	
మొత్తం గ్రామ పంచాయతీలు	484
ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు	613
జీఎస్‌ఎల్‌ఆర్‌లు	349
సిస్టర్న్‌లు	2,043



కౌతాళం మండలం బదినేహాల్ గ్రామంలో నీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు



గ్రామీణప్రాంత వాసులకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయించి, నీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం. 2 నుంచి 5వ తేదీలోగా, 17 నుంచి 20వ తేదీలోగా నీటి ట్యాంకులను తప్పకుండా శుభ్రం చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం.

– టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

నేడే ఈద్–ఉల్–ఫితర్

- చంద్ర దర్శనంతో ముగిసిన రంజాన్
- శనివారం ఈద్ నమాజ్ చేయనున్న ముస్లింలు

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసం ముసిగింది. శవ్వాల్ నెల ప్రారంభ సూచికగా శుక్రవారం సాయంత్రం చంద్రదర్శనంతో ' చాంద్ దిఖ్ గయా.. కల్ హి ఈద్ హై. ఈద్ ముబారక్ అంటూ కొందరు ముందస్తు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శనివారం దేశంలో ఈద్ ఉల్ ఫితర్ జరుపుకునేందుకు ముస్లిం మత పెద్దలు ప్రకటన చేశారు. ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేశారు. ఐదు పూటలా నమాజు చేస్తూ సహెర్, ఇఫ్తార్‌లు, ఖురాన్ పఠనం, పేదలకు ధాన ధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటినా సడలింపు లేకుండా ఉపవాస దీక్ష పాటించారు. నెలవంక కనిపించడంతో పండుగ సందడి మొదలైంది.

సూచికగా పేలిన ఔటు

రంజాన్ పండుగ సూచికగా నిర్వాహకులు ఔటును పేర్చారు. సాధారణంగా రంజాన్ చంద్ర దర్శనం సందర్భంగా మొదటి ఔటును కాల్చుతారు. ప్రతి రోజూ సహెర్, ఇఫ్తార్ వేళల్లో దీని శబ్దాన్నే ప్రామాణికంగా అనుసరిస్తారు. చివరగా శవ్వాల్ చంద్ర దర్శనం కనిపించాక ఈద్ సూచికగా ఔటును పేల్చడంతో పండుగను ధ్రువీకరించుకున్నారు. రంజాన్ చివరి రోజా రాత్రి, ఈదుల్ ఫితర్‌ను పురస్కరించుకొని లైలతుల్ జాయిజా పేరుతో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈద్ నమాజ్‌కు సిద్ధం

ఈదుల్ ఫితర్ సందర్భంగా నిర్వహించే నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్గాహ్‌లతో పాటు పలు మసీదుల్లో నిర్వాహకులు అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించారు. పండుగ రోజు అల్లాహ్‌కు కృతజ్ఞతా భావం వ్యక్తం చేసుకునేందుకు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి రెండు రకాత్‌ల ఈదుల్ ఫితర్ వాజిబ్ నమాజ్ చేస్తారు.

ఈద్ నమాజ్‌కు ముందే తప్పనిసరిగా కుటుంబ సభ్యుల (అప్పుడే పుట్టిన పసికందు అయినా సరే) పేరిట ఫిత్రా చెల్లించాల్సిన బాధ్యత అందరు ముస్లింలపై ఉందని మౌల్వీలు చెబుతున్నారు. ఫిత్రా చెల్లించకపోతే ఉపవాసాలను అల్లాహ్ అంగీకరించరని పేర్కొంటున్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో కర్నూలు నగరంలోని మసీదు

శాంతియుతంగా జరుపుకోవాలి



రంజాన్ మాసంలో గడిపిన ఆధ్యాత్మిక భావాలతోనే మిగిలిన 11 నెలలు గడపాలని ఇస్లాం సూచిస్తోంది. పండుగను జల్సా చేయరాదు. శాంతియుతంగా చేసుకోవాలి. తోటి పేదల స్థితిని గమనించి దానధర్మాలు చేయాలి. అప్పుడు రంజాన్ నేర్పిన క్రమశిక్షణ ఫలితం ఇస్తుంది.

– ఖాజీ ముత్తహిర్ జమయీ, కర్నూలు

కేసుల విచారణ వేగవంతం చేయాలి

- డీఐజీ సెంథిల్ కుమార్

కర్నూలు: అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ కేసుల విచారణ వేగవంతం చేయాలని పోలీస్ సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి శుక్రవారం కర్నూలు నగర డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కేసుల పురోగతిపై ఆరా తీశారు. శాంతిభద్రతల గురించి డీఎస్పీ మహేష్‌తో చర్చించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు సమష్టిగా, గట్టిగా పనిచేయాలన్నారు. దిశ యాప్, సైబర్ క్రైం, సీసీ కెమెరాల ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బ్లడ్ బ్యాంక్ పక్కనున్న కర్నూలు రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను కూడా డీఐజీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి, శంకరయ్య, తబ్రేజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఐజీ సెంథిల్ కుమార్

పవిత్రమైన పండుగ రంజాన్

కర్నూలు(సెంట్రల్): రంజాన్ పండుగ అతి పవిత్రమైందని, ముస్లింలు అల్లాహ్ కృపకు పాత్రులు కావాలని జిల్లా ఇన్‌చార్జిమంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వీఆర్‌కు ఇద్దరు పోలీసు అధికారులు

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇద్దరు పోలీసు అధికారులను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలూరు సీఐ ఈశ్వరయ్యపై ఇసుకకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో.. అలాగే హొళగుంద ఎస్ఐ అబ్దుల్ జహీర్ సబ్ డివిజన్ పరిధిలో దీర్ఘకాలంగా (లాంగ్ స్టాండింగ్) పనిచేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనను కూడా వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

దూర విద్య ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు సిటీ: 2022-23 విద్యా సంవత్సరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఎడ్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ యూనివర్సిటీ రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సునీల్ కన్నా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీతో పాటు, ఎన్‌సీటీఈ ద్వారా గుర్తింపు పొందిన టీటీసీ/డీఈడీ/హెచ్‌పీటీ/టీపీటీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.braouonline.in అనే వెబ్‌సైట్‌లో వచ్చే నెల 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దాం

- కలెక్టరేట్‌లో మిల్లెట్ కేఫ్ ఏర్పాటుకు ఆమోదం
- మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు జిప్సమ్, సూక్ష్మపోషకాలు
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ సృజన ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని.. పంటలపై అవగాహన పెంచేందుకు, చిరుధాన్యాల్లో పోషక విలువలను తెలియజెప్పేందుకు కలెక్టరేట్‌లో మిల్లెట్ కేఫ్‌ను నెలకొల్పేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆమోదం తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలకు తావు లేకుండా వ్యవసాయ యంత్రాంగం ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన నిఘా పెంచాలన్నారు.

- మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో రైతులు జిప్సమ్, ఇతర సూక్ష్మ పోషకాలు, వేప నూనె కోరుతున్నారని.. ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజును ఆదేశించారు.
- రబీ పంటల నమోదుకు సంబంధించి రైతుల ఈ-కేవైసీ వంద శాతం పూర్తి కావాలని, వేసవిలో సాగు చేసిన పంటలను కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు.
- జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉన్నాయని, ప్రతి ఆర్‌బీకేలో రైతులకు అవసరమైన యంత్ర పరికరాలతో కస్టమ్ హయరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.
- 118 ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీల ఏర్పాటు పెండింగ్‌లో ఉందని, వీటిల్లో కూడా ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు.
- రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ..

ఫిష్ ఆంధ్ర ద్వారా అన్ని రకాల చేపలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఫిష్ ఆంధ్ర కింద ఎన్ని రిటైల్ అవుట్‌లెట్స్ ప్రారంభించారని మత్స్య శాఖ అధికారులను ప్రశ్నించారు. జిల్లాలో 129 మినీ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు 40 ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కోరారు.

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాణ్యత లేని విత్తనాలను రైతులకు ఇచ్చి నష్టపోవడానికి కారణమైన కంపెనీలను నిషేధించాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న మామిడికి తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆరోగ్యవంతమైన పద్ధతుల్లో మామిడిని మాగించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

కోడుమూరు ఎమ్మెల్యే సుదాకర్ మాట్లాడుతూ..

మద్దతు ధరతో శనగలు కొనుగోలు చేసినప్పటికి గోదాముకు తరలించిన తర్వాత నాణ్యత లేదని వెనక్కి పంపుతున్నారని, ఇందువల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు చేసే సమయంలోనే నాణ్యతా ప్రమాణాలను సరి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఇంటి వద్దకే వైద్యం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కానెస్సెప్ట్‌లో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం గొందిపర్ల గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ ముక్తియార్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీ

నగరంలోని శుశృత ఫెర్టిలిటీ సెంటర్, న్యూ లైఫ్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్, రాధాకృష్ణ హాస్పిటల్‌లోని ఏఆర్‌టీ క్లినిక్‌ను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కోసం పై మూడు కేంద్రాలు దరఖాస్తు చేసుకున్నాయన్నారు. ఆయన వెంట కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ హెచ్‌వోడి డాక్టర్ వెంకటరమణ, రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధారాణి, డెమో శ్రీనివాసులు, సోషియాలజిస్టు భారతి, పీసీ పీఎన్‌డీటీ మానటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

మతి స్థిమితం లేని బాలిక అదృశ్యం


రాజేశ్వరి (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని గువ్వలకుంట్లకు చెందిన 16 ఏళ్ల బొందలి రాజేశ్వరి వారం రోజుల క్రితం నుంచి కనిపించడం లేదని బాలిక తల్లి బొందల కాశమ్మ శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో తన కుమార్తె ఎర్ర గౌన్ వేసుకుందని, ఆచూకీ తెలిసిన వారు 9059897237కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతి


మృతి చెందిన శంకర్‌నాయక్

తుగ్గలి: రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని చెర్వుతండా వద్ద చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, గుత్తి రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు..చిగుర్లగుట్ట తండాకు చెందిన రమావత్ శంకర్‌నాయక్(29) గొర్రెల మేపుకుంటూ జీవన సాగిస్తున్నాడు. మేతకు వెళ్లిన సమయంలో రెండు గొర్రెలు తప్పిపోయాయి. వాటిని వెతికేందుకు రైల్వే ట్రాక్ పక్కన వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన రైలును గమనించ లేకపోయాడు. దీంతో ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో పక్కకు ఎగిరిపడి మృతి చెందాడు. మృతుడికి భార్య సోమ్లీబాయి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

కార్చిచ్చుకు కళ్లెం!

- అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు
- ఫైర్ వాచర్లతో నిరంతర పర్యవేక్షణ
- పటిష్టంగా 14.05 కి.మీ. ఫైర్ లైన్స్ ఏర్పాటు
- అగ్ని ప్రమాదాల నివారణ చర్యలకు రూ.4.62 లక్షల నిధులు

కర్నూలు జిల్లా అటవీ శాఖ మొత్తం విస్తీర్ణం: 34,808.94 హెక్టార్లు

రేంజ్ పరిధిలు.. అటవీ విస్తీర్ణాలు

రేంజ్: కర్నూలు
సెక్షన్లు :2
బీట్లు: 6
అటవీ విస్తీర్ణం: 14,956.99 హెక్టార్లు
మండలాలు:వెల్దుర్తి,సి.బెళగల్,కర్నూలు, గూడూరు, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు,కృష్ణగిరి.

రేంజ్: ఆదోని
సెక్షన్లు: 3
బీట్లు: 11
అటవీ విస్తీర్ణం: 19,851.95 హెక్టార్లు
మండలాలు: కోసిగి, కౌతాళం, మంత్రాలయం నందవరం, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, ఆదోని, హొళగుంద, ఆస్పరి, ఆలూరు, దేవనకొండ, పత్తికొండ, హాలహర్వి, తుగ్గలి, మద్దికెర, చిప్పగిరి.

కర్నూలు కల్చరల్: వేసవి కాలంలో అడవులను అగ్ని కీలల నుంచి కాపాడేందుకు అటవీశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. సీసీఎఫ్ పి.రామకృష్ణ పర్యవేక్షణలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టంగా నిఘా పెడుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా పలువురు అధికారులకు విధులు కేటాయించింది. అటవీ సంరక్షణ, అక్రమ రవాణా కట్టడికి గ్రామాల్లో కళాజాతా బృందాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఫైర్ ఫైటింగ్ దళం

అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలను అదుపు చేసేందుకు అటవీ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా 11 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు పెట్రోలింగ్ చేయడంతో పాటు అడవిలో పరిస్థితులను గమనిస్తుంటారు. వారికి కావాల్సిన నీళ్ల బాటిళ్లు, బూట్లు, డ్రెస్, సేఫ్టీ కిట్స్‌ను అందించారు. కర్నూలు సిటీ ఫారెస్ట్, సోమయాజుల పల్లె ఫారెస్ట్ ప్రాంతాల్లో వీరు పెట్రోలింగ్ చేస్తుంటారు. అటవీ ప్రాంతంలో రాజుకునే మంటలను ఎస్‌ఎన్‌పీపీ శాటిలైట్ సహకారంతో డీఎఫ్‌ఓలు ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

పకడ్బందీగా ఫైర్ లైన్స్

మంటలను అదుపు చేయడానికి వీలుగా అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంటలు వ్యాపించకుండా ఆర్పేందుకు వీలుగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు డివిజన్‌లో కర్నూలు నగర వనం, సోమయాజుల పల్లె ప్రాంతాల్లో 12 కి.మీ., ఆదోని డివిజన్‌లో 2.05 కి.మీ. మేర ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశారు. 8 నుంచి 10 మీటర్ల వెడల్పుతో ఒకే వరుసలో చెట్లను, ఎండుటాకులను తొలగిస్తున్నారు. దీంతో మంటలు ఎక్కడికక్కడ ఆగిపోయే అవకాశం ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు.

జీవాలకు నీటి సౌకర్యం

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రస్తుతం నీటి ఎద్దడి లేదు. అయినప్పటికీ వేసవి కారణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లో కర్నూలు డివిజన్‌లో 11, ఆదోని డివిజన్‌లో 8 సాసర్ పిట్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా అవసరమైన చోట్ల పిట్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.


అడవిలో మంటలు వ్యాపించిన దృశ్యం(ఫైల్)

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అడవుల సంరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి. అగ్ని ప్రమాదాల నుంచి అడవిని కాపాడుకోవాలి. మంటలు రాజుకుని అడవి కాలిపోతే జీవజాతులకు ముప్పు వాటిల్లి పర్యావరణం దెబ్బ తింటుంది. అడవికి ఎవరూ నిప్పు పెట్ట కూడదు. దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలి. సమష్టి కృషి తోనే అటవీ సంరక్షణ సాధ్యం. అందులో భాగంగానే ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ఫైర్‌లైన్స్, సాసర్ పిట్స్ ఏర్పాటు తదితర వాటికి రూ.4.62 లక్షలు నిధులు మంజూరు చేశాం.

– పి. శివశంకర్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3502	రూ. 7161
పొద్దుతిరుగుడు	రూ. 4389	రూ. 4779
ఆముదం	రూ. 4581	రూ. 5484
వాము	రూ. 4690	రూ. 24610
ఎండు మిర్చి	రూ. 3269	రూ. 21109
శనగలు	రూ. 3210	రూ. 4609
కందులు	రూ. 3750	రూ. 7909
మొక్కజొన్న	రూ. 1239	రూ. 1809
మినుములు	రూ. 7000	రూ. 7000

కేఈ అనుచరులకు టీడీపీ షాక్!

- పార్టీ నుంచి ఇద్దరి సస్పెన్షన్

డోన్: రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ముఖ్య అనుచరులను ఇద్దరిని టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రకటించారు. సస్పెండ్ అయిన వారిలో ప్యాపిలి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు తొప్పెల శ్రీనివాసులు, డోన్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడ్ ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి వీరు పనిచేస్తున్నారు. డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను కేఈ కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని అధిష్టానాన్ని డిమాండ్ చేస్తుండటమే గాక ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘించినందుకు వీరిని సస్పెండ్ చేసినట్లు అచ్చెన్నాయుడు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మే 18న 'అన్నీ మంచి శకునములే'

- సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బీవీ నందిని రెడ్డి


మాట్లాడుతున్న డైరెక్టర్ నందిని రెడ్డి, చిత్రంలో హీరో సంతోష్ శోభన్, హీరోయిన్ మాళవిక నాయర్

కర్నూలు కల్చరల్: అన్నీ మంచి శకునములే సినిమాను మే 18వ తేదీన విడుదల చేయనున్నట్లు దర్శకురాలు బీవీ నందిని రెడ్డి తెలిపారు. సినిమా హీరో హీరోయిన్లు సంతోష్ శోభన్, మాళవిక నాయర్‌తో కలసి శుక్రవారం ఆమె కర్నూలు నగరానికి వచ్చారు. స్థానికంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నందినిరెడ్డి మాట్లాడుతూ.. స్వప్న సినిమా ప్రొడక్షన్ హౌస్, మిత్ర విందా మూవీస్ బ్యానర్‌లో ప్రియాంక దత్ నిర్మాతగా సినిమా తెరకెక్కిందన్నారు. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించారన్నారు. ఈ చిత్రం నుంచి గల గల ఏరులా పాట విడుదలై ఇప్పటికే హిట్ టాక్ వచ్చిందన్నారు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా సినిమా రూపొందిందన్నారు. హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ థియేటర్‌లో మూడు గంటల పాటు ఆహ్లాదంగా గడిపేలా సినిమా ఉంటుందన్నారు. హీరోయిన్ మాళవిక నాయర్ మాట్లాడుతూ తెలుగు భాషను నేర్చుకొని తెలుగులో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు.

ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు

కర్నూలు సిటీ: యువత నైపుణ్యాలను మెరుగుపరిచి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసిందని డీఆర్‌డీఏ పీడీ ఎం. వెంకటసుబ్బయ్య తెలిపారు. సిల్వర్‌జూబ్లీ కాలేజీలోని స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన యువతీ, యువకులకు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. స్కిల్ హబ్‌లో మూడు నెలల పాటు శిక్షణ పొందిన వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి పి.సోమశివరెడ్డి, సిల్వర్‌జూబ్లీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- జిల్లా స్థాయి రహదారి భద్రత సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): రోడ్లను ఆక్రమించినా, బారికేడ్లను తొలగించినా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రహదారి భద్రత సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఓర్వకల్లు సమీపంలో అండర్ పాస్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు సంతోష్ నగర ఫ్లైఓవర్ వద్ద పూర్తిస్థాయిలో బారికేడ్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని డీఎస్పీ నాగభూషణం, డీటీసీ శ్రీధర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందుకు జాతీయ రహదారుల అధికారులు స్పందిస్తూ.. బారికేడ్లను ఏర్పాటు చేసినా స్థానికులు తొలగించి రోడ్డును అక్రమించుకుంటుండడంతో సమస్య తలెత్తుతోందని వివరించారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడడంలో భాగంగా రోడ్డును అక్రమించినా, బారికేడ్లను తొలగించినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో నెలకు ఒకసారి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే రహదారి భద్రతా సమావేశాలకు నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్లు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఇంతవరకు ఎన్నిసార్లు రహదారి భద్రతా సమావేశాలు నిర్వహించారు.. ప్రాజెక్టు డైరెక్టర్లు ఎన్నిసార్లు హాజరయ్యారు.. వారు హాజరు కాకపోవడంతో పరిష్కారం కాని పనులతో జరిగిన ప్రమాదాల వివరాలు తనకు నివేదించాలని డీటీసీ శ్రీధర్‌ను ఆదేశించారు. జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వారంలోపు పూర్తి చేయాలన్నారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ.. కర్నూలులోని బళ్లారి చౌరస్తా జంక్షన్ పరిసరాల్లో సర్వీసు రోడ్డు చాలా తక్కువగా ఉందన్నారు. కర్నూలులో నగరంలో కొన్ని బస్ బేస్‌లు నిరుపయోగంగా ఉన్నాయని, ఉపయోగంలో లేని వాటిని తొలగిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు నగరంలోని ప్రధాన రహదారుల్లో 100 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయని, అందులో మరమ్మతుకు గురైన 65 కెమెరాలను బాగు చేసినట్లు చెప్పారు. నగరంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో కూడా సీసీకెమెరాలో ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. అంతకముందు రహదారి భద్రతకు సంబంధించిన నివేదికను డీటీసీ శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ రమేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, సూపరింటెండెంట్ నరేంద్రనాథ్‌రెడ్డి, పీఆర్ డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ముగ్గురు అరెస్ట్

డోన్ టౌన్: తండ్రి, కుమారుడి ఆస్తి వివాదంలో మధ్యవర్తులుగా ఉండి కిడ్నాప్‌నకు పాల్పడి బెదిరించిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శరత్‌కుమార్ శుక్రవారం తెలిపిన వివరాల మేరకు కొత్తపేటకు చెందిన వినోద్‌కుమార్, అతని తండ్రి బుక్‌స్టాల్ కుమార్ మధ్య ఆస్తి వివాదం ఉంది. పట్టణంలోని రాసిపోగుల కిరణ్‌కుమార్, సూర్యతేజ, ఆవులదొడ్డికి చెందిన పెద్దపోగుల ప్రసాద్.. బుక్‌స్టాల్ కుమార్ తరపున మధ్యవర్తులు ఆస్తి వివాదంలో జోక్యం చేసుకున్నారు. గతేడాది డిసెంబర్ 28వ తేదీన వినోద్‌కుమార్, అతని భార్య స్రవంతి, కుమార్తె దీక్షితను కిడ్నాప్ చేసి బెదిరించి తండ్రి ఆస్తిలో ఎలాంటి సంబంధం లేదని రాయించి సంతకాలు చేయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు మధ్యవర్తులుగా ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

రోగి వద్దకే ఎక్స్‌రే యూనిట్


మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోగి పడుకున్న బెడ్ వద్దకే ఎక్స్‌రే మిషన్ వచ్చే సదుపాయం పెద్దాసుపత్రిలో అందుబాటులోకి వచ్చిందని సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. క్యాజువాలిటీ విభాగంలో మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో క్యాజువాలిటీలో ఎవరైనా రోగికి ఎక్స్‌రే తీయించాల్సి వస్తే రేడియాలజీ విభాగంలోని ఎక్స్‌రే ప్లాంట్‌కు వెళ్లాల్సి వచ్చేదన్నారు. రోగిని అటూ ఇటూ తిప్పడం వల్ల సమయం వృథా కావడంతో పాటు పలు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వీటిని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర విభాగంలో మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఈఎండీ ఇన్‌చార్జ్ డాక్టర్ రామశివనాయక్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యాసాగర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం మద్దూరునగర్‌లోని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దాల తరబడి వ్యవసాయంలో రసాయనాలు వాడుతుండటంతో నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, పర్యావరణానికి కూడా హాని కలుగుతోందన్నారు. భూమి ఆరోగ్యాన్ని బాగు చేసేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డీపీఎం చంద్రశేఖర్, కన్సల్టెంటు లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఒపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 120 మందిలో 104 మంది హాజరు కాగా, 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష సజావుగా సాగినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి తెలిపారు.

ఉపాధి హాజరు 1.57లక్షలకు చేరాలి


డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు 1.57 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా ఏపీఓలు, ఏపీడీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్‌లో ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించారు. జాబ్‌కార్డు కలిగిన వారంతా పనులకు వచ్చేలా చూడాలన్నారు. ప్రస్తుతం 1.06 లక్షల మంది మాత్రమే వస్తున్నారని, లక్ష్యానికి అనుగుణంగా లేబర్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోజు వేతనం రూ.272 పొందేలా పనులు చేయించాలన్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 11 గంటలకు ఇళ్లకు చేరుకునేలా చూడాలన్నారు. గరిష్ట వేతనం పొందేందుకు అవసరమైతే సాయంత్రం కూడా పనులు చేసుకోవచ్చని సూచించారు. 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలు అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా ఏఓ నాగేశ్వరరావు, అదనపు పీడీ సలీమ్ బాషా, ఫైనాన్స్ మేనేజర్ అదెయ్య తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రలో ఇసుక తోడేళ్లు!


మునగాలపాడు వద్ద తుంగభద్ర నదిలో ఇసుకను తోడి ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం


నది ఒడ్డున ఇసుకను డంప్ చేస్తూ..

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని తుంగభద్ర నదిలోని ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారు. ఇక్కడ రీచ్ లేకపోయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారు. మామిదాలపాడు, మునగాలపాడు, నిడ్జూరు, పంచలింగాల గ్రామాల్లోని కొందరు మాఫియాగా ఏర్పడి ఇష్టానుసారంగా నదిలో ఇసుకను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా తుంగభద్ర నది ఒడ్డున పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. డంప్‌లోని ఇసుకను కర్నూలు నగరంలోకి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నదిలోని ఇసుకను టన్నులు టన్నులుగా తోడేయడంతో నిల్వ ఉన్న నీటి శాతం పూర్తిగా తగ్గిపోయి తాగడానికి నీళ్లు కూడా దొరకని పరస్థితి నెలకొనే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లాలోని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ APRJC, POLYCET, SHRESTA, (8&10 Classes) YASHASVI (8&10 Classes), నవోదయ సైనిక్ స్కూల్ల మొదలైన ప్రవేశ పరీక్షల కొరకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వబడును. హాస్టల్ వసతి కలదు. సంప్ర: RIGHT Academy, KNL. Cell: 94939 02958 [L-799111]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-495]

REAL ESTATE

PLOT FOR SALE

■ కర్నూలు-నంద్యాల రోడ్డు, ఇండ్ల మధ్యలో రాగమయూరి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రక్కన "నందనందన జూబ్లీహిల్స్" నూతన వెంచర్‌లో 30x40, 30x50, 30x60 సైజు ప్లాట్లు అమ్మకానికి కలవు. 70937 77644 [L-799366]

■ కర్నూలు నుండి గుత్తి రోడ్డు దగ్గర, తిరుమల గిరి టౌన్‌షిప్ నందు సర్వే నెం. 691, ప్లాటు నెం. 492లో 3 సెంట్ల స్థలం 30x45 అ॥ అమ్మకంనకు కలదు. 90522 73756, 93929 50888 [L-799121]

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30x40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్షలు మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 98884 24222 [L-799117]

■ కర్నూలు – ఓర్వకల్లు దగ్గర జయరాజ్ స్టీల్ ప్లాంటుకు వెళ్ళే దారిలో అతి తక్కువ ధరకు ఓపెన్ ప్లాట్లు కలవు. (30x40) స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కలదు. క్రిష్ణమూర్తి – 95330 49765 [L-799364]

■ కర్నూలు సిటీకి 6 కి.మీ. దూరంలో చెన్నై to సూరత్ 6 లైన్ హైవేకు అతి సమీపంలో ఎర్రచందనం ఫాం ల్యాండ్స్, 44x50 సైజు గల ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర: లేపాక్షి 97030 03776 [L-799191]

■ 'పద్మ రెసిడెన్సీ' అపార్ట్మెంట్ టీచర్స్ కాలనీలో 26 లక్షల మొదలు Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 78 లక్షలలో లగ్జరీ 3BHK హౌస్ & సూదిరెడ్డిపల్లి రోడ్ సూపర్ లగ్జరీ డూప్లెక్స్ హౌస్ అమ్మకమునకు కలవు. 90145 80500 [L-799168]

■ కర్నూలు-పంచలింగాల దగ్గర, స్కంద వెంచర్ డి.బ్లాక్ నందు 30x50 సైజు గల పడమర ఫేస్ ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర: 90529 59380 [L-799105]

HOUSE FOR SALE

■ Kuda Approvalతో గణేష్ నగర్‌లో Padma's Residency అపార్ట్మెంట్‌లో 1,2,3 BHK Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 77 లక్షల లగ్జరీ 3BHK హౌస్ & సూదిరెడ్డిపల్లి రోడ్ సూపర్ లగ్జరీ హౌస్ అమ్మకమునకు కలవు. 90143 35313 [L-799170]

■ బాలాజీనగర్‌లో ఉత్తరం 7.5 సెంట్లలో 2 షాపులు, 3 కార్ల పార్కింగ్‌తో, హోమ్ థియేటర్ పెట్టుకోగల 25 అ॥ల హాలుతో 10 రూముల ఇల్లు అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్ – 89198 68887 [L-799159]

TO-LET

■ మహానంది మండలం, అల్లినగరం గ్రామంలో 2.5 సెంట్లలో కొత్తగా నిర్మించిన జి+1 హౌస్ అద్దెకు ఇవ్వబడును. ఆఫీస్‌లకు, బ్యాంక్‌లకు, ఫ్యామిలీస్‌కు అనుకూలం. సంప్ర: 82475 78666, 98856 10083 [L-799120]

SERVICES

■ నగర ప్రజలకు శుభవార్త! కరెంట్ బిల్లులతో విసిగిపోతున్నారా. అయితే సోలార్ పవర్‌ని ఉపయోగించుకొండి. మీ కరెంట్ బిల్లుల నుండి ఉపశమనం పొందండి. తక్కువ మెయింటెనెన్స్‌తో 25 సం॥ల వరకు కరెంటు బిల్స్‌ను 90% ఆదా చేసుకొండి. కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్. 81062 20228; 08518-254789. పని చేయుటకు వర్కర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. [L-799122]

BUSINESS OFFER

■ అద్భుత వ్యాపార అవకాశం! గ్యాస్ ప్రమాదాలను అరికట్టే సేఫ్టీ డివైస్ ప్రమోట్ చేస్తూ రో॥ 5000/- వరకు సంపాదించే అవకాశం, ఏరియా వైజ్ ఫ్రాంఛైజీలకై సంప్ర: 9100532959 [H-797452]

ASTROLOGY

■ శ్రీ వైదీశ్వరన్ కోవిల్ నాడీ జ్యోతిష్యాలయం. మీ బొటన వేలి గుర్తును బట్టి, పుట్టిన తేదీ ఆధారంగా మీ యొక్క భవిష్యత్తు చెప్పి పరిష్కారం చూపబడును. పాతబస్టాండ్, కర్నూలు. 83092 09485. [L-799360]

MARRIAGE SERVICES

■ స్టార్ ముస్లిం మ్యారేజ్ బ్యూరో, నంద్యాల బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రైవేట్, టీచర్స్ బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, ఆర్మీ, డాక్టర్ సంబంధాలు కలవు. 87908 44959 (2వ సంబంధాలు కలవు) [L-799123]

WANTED

■ కర్నూలులో ప్రముఖ AZMASS కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్ కావలెను. సంప్ర: 90294 92949 [L- 799194]

■ నంద్యాల దగ్గర పాండురంగపురంలో ప్రముఖ వెంచర్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీ: 10 వేలు, అర్హత: 10th పాస్/ ఫెయిల్. 95817 76921, 95817 76923 [L-799363]

■ SBI Life ఇన్సూరెన్స్‌లో సేల్స్ మేనేజర్లుగా ఆదోని, ఆలూరు, కౌతాళం ఏరియాలకు అభ్యర్థులు కావలెను. అర్హత: డిగ్రీ, 1 సం॥ అనుభవం. 99857 99555 [L-799118]

■ జాబ్స్ : మీ గ్రామం / మీ మండలం లోనే ఉంటూ My V3 Ads కంపెనీలో పార్ట్‌టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్. సంప్ర॥ G.మురళి, సెల్: 9030661651. [A-734391]

■ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన పర్సనల్ సెక్రటరీ (F) ప్రముఖ కాలేజీలు, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్ నందు వర్క్ చేయుటకు సెక్యూరిటీ గార్డులు (M) కావలెను. సంప్ర: 80088 69176, 90630 64081 [L-590]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 16K–18K, విజయవాడ ఫోన్: 9640528899, 9640648899 [HA-57]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785861]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ
23	0
59,655	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,191	▼	425
బంగారం (22 క్యారెట్)	59,950	▼	423
వెండి (కిలో)	74,773	▼	646

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021–22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021–22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ–డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022–23) క్యూ4(జనవరి–మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021–22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021–22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్ అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375–00
చిత్తూరు	418–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365–00
విజయవాడ	365–00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358–00
వరంగల్	360–00
రిటైల్ ధర	4.20

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా–హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018–19 నుంచి 2022–23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 – 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్‌ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ



జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ–ఓజస్ రెండో రౌండ్‌లో 159–157తో మరియా–గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159–156తో సోఫీ–అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157–155తో ఫాతిన్ నూర్‌ఫతే–జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్–చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ–ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్–భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3–5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6–0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6–4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6–4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6–5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఎలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6–4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఎలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్–1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్–2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–2, 6–4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే



కాన్వే



జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1–35, 2–71, 3–84, 4–90, 5–95, 6–116, 7–134. **బౌలింగ్:** ఆకాశ్ 3–0–17–1, తుషార్ దేశ్‌పాండే 3–0–26–0, తీక్షణ 4–0–27–1, మొయిన్ అలీ 2–0–18–0, జడేజా 4–0–22–3, పతిరణ 4–0–22–1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం:** 1–87, 2–110, 3–122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2–0–10–0, జాన్సెన్ 3–0–37–0, మార్క్‌రమ్ 1–0–11–0, సుందర్ 2.4–0–16–0, మార్కండే 4–0–23–2, ఉమ్రాన్ 3–0–18–0, డాగర్ 3–0–21–0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్‌లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ చెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?

సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.